

విశ్రాంత హోమ్‌గార్డులకు సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా హోమ్‌గార్డు యూనిట్‌లో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన హోమ్‌గార్డులు వి.ఉమామహేశ్వరరావు, జి.రాజులను ఎస్‌పి జి.ఆర్.రాధిక సోమవారం సన్మానించారు. ఈ మేరకు చేరొక్కరికి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5 వేలు నగదు చెక్కులను, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హోమ్‌గార్డులు విశ్రాంతి తీసుకున్నా మీరు పోలీస్ శాఖలో ఒక భాగమనని, భవిష్యత్‌లో మీకు ఎటువంటి అవసరం ఉన్న పోలీసు శాఖ ఎల్లవేళలా తోడుగా ఉంటుందని తెలియజేశారు. ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్, ఎఆర్ డిఎస్‌పి ఎల్.శేషాద్రినాయుడు, హోమ్‌గార్డు ఆర్‌ఐ కె.వి.నర్సింగరావు, రమేష్ పాల్గొన్నారు.

ఏది 'జలకళ'

రైతులకు ఉచితంగా బోర్లు వేయిస్తామని గత ఎన్నికల ముందు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆర్భాటంగా ప్రకటించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్లు కావొస్తున్నా నేటికీ ఉచిత బోర్లకు దిక్కులేకుండా పోయింది. జిల్లాలో సాగునీటి సౌకర్యం లేని భూముల్లో ఉచితంగా బోర్లు వేసి వాటిని వినియోగంలో తీసుకొస్తామంటూ వైసిపి ప్రభుత్వం నాలుగున్నరేళ్ల కిందట వైఎస్ఆర్ జలకళ పథకాన్ని తీసుకొచ్చింది. బోర్లతో పాటు విద్యుత్ కనెక్షనూ అందిస్తామని చెప్పడంతో రైతులు ఉత్సాహంగా దరఖాస్తు చేసుకున్నారు. బోర్ల తవ్వకాలకు అధిక బడ్జెట్ వెచ్చించాల్సి రావడంతో దరఖాస్తులకు క్లియరెన్స్ ఇవ్వలేదు. పథకాన్ని ఆపేశారా? లేక ఇస్తారా? అని రైతులు ఎదురుచూస్తున్నారు.

- బోర్ల తవ్వకాలకు 5,714 మంది దరఖాస్తు
- ఇప్పటివరకు 154 మందికే మంజూరు
- చాలాచోట్ల బోర్లు తవ్వేసి కనెక్షన్లు ఇవ్వని వైనం
- మూడున్నరేళ్లుగా నిరీక్షణే

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

చిన్న సన్నకారు రైతులకు మేలు కలిగించేందుకు వైసిపి ప్రభుత్వం సెప్టెంబరు 28, 2020లో ప్రారంభించింది. బోరు సౌకర్యం లేని 2.5 ఎకరాలు నుంచి ఐదు ఎకరాల వరకు ఉన్న రైతులను అర్హులుగా పేర్కొంది. బోర్ల తవ్వకం, విద్యుత్ కనెక్షన్లను ఉచితంగా ఇస్తామంటూ ప్రకటించింది. ప్రస్తుతం అందులో మార్పులు చేయడంతో అన్నదాతలు ఉసూరుమంటున్నారు. ఐదెకరాల్లోపు వారికి సైతం రూ.2 లక్షల్లోపు మాత్రమే విద్యుత్ కనెక్షన్ల ఖర్చు చేస్తామని, అంతకంటే ఎక్కువ అయితే రైతులే భరించాల్సి ఉంటుందని పేర్కొంది. అయినా రైతులు ఖర్చుకు వెనుకాడకుండా బోర్లు తవ్వించుకోవడానికి సిద్ధపడ్డారు. జిల్లాలో వైఎస్ఆర్ జలకళ పథకం కోసం మొత్తం 5,714 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 4,690 దరఖాస్తులు అర్హమైనవిగా తేల్చారు. వాటిలో 2,299 చోట్ల సర్వే పూర్తి చేశారు.



కోటబొమ్మాళి మండలం ఊడికలపాడులో ట్రాన్స్‌ఫార్మర్ వేసి కనెక్షన్ ఇవ్వని అధికారులు (ఫైల్)

154 మందికే బోర్లు మంజూరు

బోర్ల కోసం జిల్లాలో వేలాది మంది దరఖాస్తు చేసుకున్నా 154 మందికే అప్రూవల్ ఇచ్చారు. వీరిలో ఆరుగురు రైతులు ఇప్పటికే రూ.19.82 లక్షలు చెల్లించారు. ఇంకా 148 మంది రూ.5.31 కోట్లను చెల్లించాల్సి ఉంది. వీటిలో శ్రీకాకుళం డివిజన్‌లో 59, పలాస డివిజన్‌లో 24, టెక్కలి డివిజన్‌లో 71 మందికి బోర్లు మంజూరయ్యే అవకాశం ఉంది.

బోర్లు తవ్వినా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వని వైనం

సాధారణంగా ఒక ట్రాన్స్‌ఫార్మర్, నాలుగు విద్యుత్ స్తంభాలు వేస్తే రూ.2 లక్షల అంచనా వ్యయం దాటిపోతుంది. లబ్ధిదారుల్లో ఎక్కువ మంది ఒకటి నుంచి రెండు కి.మీ. మేర స్తంభాలు వేయాల్సిన వారు ఉన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో కలిపితే వారికి రూ.5 నుంచి రూ.6 లక్షలు దాటిపోతోంది. ప్రభుత్వం కనీసం రెండు లక్షలు ఇచ్చినా మిగిలిన ఖర్చు భరించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన కనిపించడం లేదు. ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులకు రూ.2 లక్షల వరకు విద్యుత్ కనెక్షన్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని చెప్పినా ఆ తర్వాత ఎవరికీ డబ్బులు చెల్లించలేదు. ఎక్కడా ఒక్క కనెక్షన్ ఇవ్వలేదు. కొన్ని చోట్ల విద్యుత్‌శాఖ కనెక్షన్లు ఇచ్చినా వాటికైనా ఖర్చునూ ప్రభుత్వం చెల్లించలేదని తెలుస్తోంది. ప్రభుత్వం విద్యుత్‌శాఖకు డబ్బులు ఇవ్వకపోవడంతో కనెక్షన్లను ఆపేసింది. దీంతో బోర్లు తవ్వి విడిచిపెట్టేయంతో మట్టి కూరుకుపోతోందని, తమకూ బోర్లు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు మరో పోరాటం

సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి- మందస

మందస జమీందారీ వ్యతిరేక పోరాటంలో బ్రిటిష్ సామ్రాజ్యవాద తూటాలకు బలైన తొలి మహిళ వీరనారి గున్నమ్మ పోరాట స్ఫూర్తితోనే ప్రస్తుతం ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణకు మరో పోరాటానికి సన్నద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు పిలుపునిచ్చారు. మండలంలోని వీరగున్నమ్మపురంలో సోమవారం వీరనారి గున్నమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వారు మాట్లాడుతూ జమీందారీ వ్యతిరేక పోరాటంలో 1940 ఏప్రిల్ 1న వీరనారి గుణ్ణమ్మతోపాటు గుంట బుడియాడు, గొర్రెల జగ్గయ్య, కర్రి కలియాడు, గుంట చిన్నారాయణ వీరమరణం పొందారని అన్నారు. ఏ ఆశయం కోసం అయితే ప్రాణాలర్పించారో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అవి ప్రమాదంలో పడ్డాయన్నారు. బిజెపి ప్రభుత్వం మోడీ నాయకత్వంలో రాజ్యాంగ పునాదులను ధ్వంసం చేస్తుందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం దేశ సంపదైన సహజ వనరులను, ప్రభుత్వ రంగ సంస్థలను భూములను కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెడుతుందని వివరించారు. ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తుందని విమర్శించారు. ఆంధ్రాకు ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా ద్రోహం చేసిన బిజెపితో టిడిపి, జనసేన, ప్రత్యక్షంగాను, పరోక్షంగా వైసిపి వెళ్లడం సిగ్గుచేటని అన్నారు. వామపక్ష లౌకిక శక్తుల ప్రత్యామ్నాయమే దేశానికి అవసరమని వారన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హనుమంతు ఈశ్వరరావు, ఆర్.దిలీప్‌కుమార్, ధర్మారావు, పి.అప్పలస్వామి పాల్గొన్నారు.



స్థూపం వద్ద నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

సామాజిక పింఛన్ల పంపిణీకి ప్రణాళిక

సిఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. జిల్లాలో 732 సచివాలయాల ద్వారా ఒక్కో సచివాలయానికి సగటున 456 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డితో సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రధానంగా పింఛనుదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. వేసవిలో తాగునీటి సరఫరా, ఉపాధి హామీ అమలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై జరిగిన సమీక్షలో కలెక్టర్ వివరించారు. జిల్లాలో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. చెరువులను, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీటిని భద్రపరచడానికి వీలుగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. నీటి నిల్వలను సవరించి వేసవిలో తాగునీటి సరఫరాకు ప్రణాళిక రూపొందిస్తున్నామని అన్నారు. ఇప్పటికే సమగ్ర నివేదికలను సిద్ధం చేసుకున్నట్టు తెలిపారు.

అలాగే వడదెబ్బకు గురి కాకుండా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఉపాధి హామీ పనుల్లో నీటి సంరక్షణ పనులు, తాగునీటి చెరువుల డీసిల్టింగ్ పనులకు ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో జెసి ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.శ్రీధర్, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, డిపిఒ వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ ఎన్.వి.చిట్టిరాజు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నుంచి పి.రాము పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న ఎస్‌పి రాధిక

విద్యార్థుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

విద్యార్థుల భద్రతపై కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని వివిధ కళాశాలలు యాజమాన్యంతో విద్యార్థుల భద్రత, ఆత్మహత్యలు నివారణ వంటి అంశాలపై సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలలు, వసతిగృహాలకు వచ్చిన విద్యార్థినీ విద్యార్థుల ప్రవర్తనను సిసి టివి కెమెరాల ద్వారా పర్యవేక్షించే విధంగా చేసుకోవాలన్నారు. కళాశాల లేబొరేటరీస్, ప్రిమిసెస్, క్లాస్రూమ్స్, లైబ్రరీస్, కారిడోర్స్, స్టాఫ్ రూమ్స్‌ల్లో తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎవరైనా బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులను కౌన్సెలింగ్ నెపంతో తరచుగా పిలుస్తున్నారన్న విషయంపై కాలేజ్ యాజమాన్యం దృష్టి చారించాలన్నారు. కాలేజీలో బోధన, బోధనేతర సిబ్బందిని నియమించినప్పుడు వారి నేర ప్రవృత్తి, పూర్వాపరాలు అన్ని పరిశీలన చేసి తీసుకోవాన్నారు. విద్యార్థినులకు కౌన్సెలింగ్ ఇచ్చినప్పుడు మహిళా సిబ్బంది కచ్చితంగా వారితో పాటు ఉండాలన్నారు. లేబొరేటరీస్‌లో ప్రాక్టికల్ వర్క్ విద్యార్థినులు వెళ్లినప్పుడూ వారితో మహిళా సిబ్బంది తప్పనిసరిగా ఉండాలన్నారు. కళాశాలలో శారీరక దండన, కార్పొరేట్ కల్చర్ ఎడ్యుకేషన్, అందరు పిల్లల ముందు అవహేళన చేయడం వంటివి చేయకూడదని స్పష్టం చేశారు. కళాశాలల వద్ద ర్యాగింగ్ జరగకుండా తగు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. హాస్టల్లో నిరంతర పర్యవేక్షణకు తప్పనిసరిగా వార్డెన్‌ని ఏర్పాటు చేయాలన్నారు. బాలికల హాస్టళ్ల వద్ద తప్పనిసరిగా మహిళా వార్డెన్‌నే నియమించాలన్నారు. కారిడోర్స్, బాల్కనీ ఉన్న చోట్ల పిట్ట గోడల పైనుంచి క్లోజ్డ్ గ్రిల్స్, క్లోజ్డ్ మెష్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యార్థుల ప్రవర్తన, మార్పులపై శ్రద్ధ వహించి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడే విధంగా చర్యలు చేపట్టారు. తరచుగా సైకియాట్రిస్టు, మోటివేషనల్ స్పీకర్స్ ద్వారా పిల్లల్లో మనోధైర్యాన్ని నింపే విధంగా క్లాసెస్ కండక్ట్ చేయాలన్నారు. పరీక్షలు, ఫలితాల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాలన్నారు. క్యాంపస్ కాప్స్, చిన్నారికి చేదోడు కార్యక్రమాల ద్వారా విద్యార్థుల వ్యక్తిగత సమస్యల నివారణకు, వారు ఒత్తిడికి గురికుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్ఐఒ పి.దుర్గారావు మాట్లాడుతూ విద్యార్థులకు స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించి నిత్యం యోగా, ధ్యానం వంటి ప్రక్రియలు పది నిమిషాలు చేసే విధంగా కళాశాల యాజమాన్యం, తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి డాక్టర్ జి.ప్రేమ్ కాజల్, డిఎస్‌పి ఎ.విజయకుమార్, సిఐలు ఉమామహేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి, ఎస్ఐలు, వివిధ కళాశాల యాజమాన్యం ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



ఫోటో నేమ్:5 మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

పింఛన్ల సొమ్ము దారిమళ్లింపు

ఎమ్మెల్యే బెందాళం అశోక్

ప్రకాశక్తి- కవిటి

ఖజానాలో నిధులు దారి మళ్లించడంతోనే పింఛన్లు సకాలంలో పంపిణీ చేయలేకపోతున్నారని, మార్చి 16 నుంచి 30 వరకు రూ.13 వేల కోట్ల పింఛన్ల సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు ముఖ్యమంత్రి తన సొంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆరోపించారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అశోక్ సోమవారం విలేకరులతో మాట్లాడారు. పింఛన్ల సొమ్ము ప్రజల ఇంట వద్దకే పంపిణీ చేయకుండా టిడిపి అడ్డుకుందని వైసిపి నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. వాస్తవానికి వారి దోపిడీకి ప్రస్తుతం ఖజానా ఖాళీ అయిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1.35 లక్షల మంది సచివాలయ సిబ్బంది ఉన్నప్పుడు ఇంటివద్దకే వెళ్లి పింఛన్లు అందించడంలో ప్రభుత్వం ఎందుకు పిల్లిమొగ్గలు వేస్తోందని ప్రశ్నించారు. ఒకటో తేదీన ఇవ్వాల్సిన పింఛన్ల సొమ్ము, జనవరి 23న ఇవాల్సిన ఆసరా డబ్బులు, ఫిబ్రవరి 16న బటన్ నొక్కిన చేయూత డబ్బులు, ఫిబ్రవరి 29న బటన్ నొక్కిన విద్యా దీవెన, మార్చి 14న బటన్ నొక్కిన ఇబిసి నేస్తం పథకాలకు చెందిన మొత్తం రూ.13 వేల కోట్లు కేవలం 15 రోజుల్లో తన అనుకూల కాంట్రాక్టర్లకు దోచిపెట్టడంతో ప్రస్తుతం పింఛన్లకు కొరత ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం చేసిన దుర్మార్గాన్ని కప్పిపుచ్చుకోవడానికి టిడిపిపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నెలనెలా ఇంటి వద్దకే రూ.4 వేలు పింఛన్ అందిస్తామని, వైసిపి కార్యక్రమాల్లో పాల్గొనకుండా కేవలం ప్రజాసేవలో ఉండే వాలంటీర్లను తమ ప్రభుత్వంలో కూడా కొనసాగిస్తామని పేర్కొన్నారు. రోజురోజుకూ దిగజారుతున్న తమ పరిస్థితి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం ఇటువంటి లేనిపోని ఆరోపణలు చేస్తోందని స్పష్టం చేశారు. సమావేశంలో స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మే 27 నుంచి విద్య, వైజ్ఞానిక శిక్షణా తరగతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మే 27 నుంచి టెక్కలి ప్రణవి డిగ్రీ కాలేజ్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహనరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.చందు, డి.హరీష్‌లు తెలిపారు. ఈ మేరకు నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో సోమవారం లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగంలో ఉండే సమస్యలపైన, విద్యార్థుల హక్కుల కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ నాటి నుంచి నేటి వరకూ అలుపెరిగిన పోరాటం చేస్తుందని అన్నారు. దేశంలో మతోన్మాద శక్తులను తరిమికొట్టి దేశంలో లౌకిక ప్రజాస్వామ్య విలువలను కాపాడగలిగేది కేవలం విద్యార్థులు మాత్రమే అని అన్నారు. ఇటీవల కాలంలో జెఎన్‌యు యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ విజయ దుందుభి మోగించి బిజెపి ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులను దేశం నుంచి ఇది ఒక ఆరంభం మాత్రమేనని అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథంతో కూడిన విద్యను అందిస్తూ వారిలో సృజనాత్మక శక్తిని వెలుగు చేసేందుకు ఈ రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



జీడి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- కొత్తూరు

అకాల వర్షాలతో పూత దశలోనే జీడి పంట పాడైందని, అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి గిరిజన రైతులను ఆదుకోవాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని గొట్టిపల్లి సచివాలయంలో గిరిజనులతో కలిసి జీవనాధైన జీడి సమస్యపై విలేజ్ అగ్రకల్చరల్ అసిస్టెంట్ శ్రీలక్ష్మిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి సీజన్‌లో గిరిజనుల ప్రధాన ఆదాయ వనరు అయిన జీడి పంట అకాల వర్షాలతో పూత దశలోనే జీడి పంట పూర్తిగా పాడైందన్నారు. పంటకు పంట బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజనులు నిమ్మక సంతోష్ కుమార్, గేదెల ధర్మారావు, గేదెల తులసమ్మ, నిమ్మక రత్నాలమ్మ, ఆరిక చిన్నమ్మడు, పాలక పార్వతి, నిమ్మక పొట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పరమేశ్వరరావు?

ప్రజాశక్తి- టెక్కలి

కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు పేరును పార్టీ అధిష్టానం ఖరారు చేసినట్లు తెలిసింది. వచ్చే నెలలో జరుగనున్న లోక్‌సభ, శాసనసభా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేయనున్న అభ్యర్థుల తొలి జాబితా మంగళవారం వెలువ డనుందని తెలిసింది. పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా ఇడుపాయలో జాబితా విడుదల చేయనున్నారనే జిల్లా కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెప్పాయి.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఎన్నికల్లో విధుల్లో పాల్గొనే ప్రతి ఉద్యోగికీ పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించాలని, అందుకుతగ్గ ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల నిర్వహణ అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించాల్సి ఎన్నికల విధులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు వీలుగా అవసరమైన ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టరేట్‌లో పాల్గొన్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ బ్యాలెట్ పేపర్, హౌసింగ్ ఓటింగ్‌కు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియను చేపడుతున్నట్టు వివరించారు. సమావేశంలో జెసి ఎం.నవీన్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, ఎల్‌డిఎం సూర్యకిరణ్, డ్వామా పీడీ చిట్టిరాజు, డిటిసి ఇంద్రశేఖరరెడ్డి, ఆర్‌టిసి ఆర్ఎం విజయకుమార్, ఎంవిఐ గంగాధర్ పాల్గొన్నారు.



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి అప్పలరాజు

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పలాస

పలాస మంత్రి కార్యాలయంలో సోమవారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 28వ వార్డు నుంచి 50 మంది యువకులు పశు సంవర్ధక శాఖామంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో టిడిపి నుంచి వైసిపిలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గణేష్, ఉర్నాన అవినాష్, కుర్మాన శేఖర్, శంబాన మోహన్, చింతల కార్తీక్, చల్ల ధనరాజు తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి బోనెల రాము, జిల్లా అధికార ప్రతినిధి బడగల బల్లయ్య, శ్రీనివాస్ రెడ్డి, ఇరిగేషన్ డైరెక్టర్ మళ్లా రవికుమార్, చాపర సింహాద్రి, సింహాచలం, కొన్న బైరాగి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ ఛాన్సలర్ రజని

ఎడాక్స్ కోర్సులపై విసి సమీక్ష

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

డా.బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం, రాష్ట్ర ఉన్నత విద్యా మండలితో కలిసి ఇటీవల ప్రారంభించిన (ఎడాక్స్) కోర్సులపై సోమవారం ఆన్‌లైన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ప్రిన్సిపాళ్లు, ఎడాక్స్ కోర్సుల సమన్వయకర్తలతో నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో వైస్ ఛాన్సలర్ కె.ఆర్.రజిని మాట్లాడుతూ ఈ కోర్సుల కోసం ఇప్పటివరకు 2వేల మంది ఇ-మెయిల్ ద్వారా రిజిస్టర్ అయ్యారని, వీటిలో నమోదు చేసుకునే విద్యార్థుల సంఖ్యను మరింతగా పెంచాలని సూచించారు. మంగళవారం నుంచి ఆయా కళాశాలలకు వర్సిటీ నుంచి సాంకేతిక బృందాన్ని పంపించడం జరుగుతుందని ఆమె తెలిపారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే అజెండా

ప్రజాశక్తి- కవిటి

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ఎపిటిఎఫ్ ప్రధాన అజెండా అని మండల ఎపిటిఎఫ్ గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి రంగారావు అన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కవిటి ప్రాంగణంలో ఎపిటిఎఫ్ 1938 నూతన కార్యవర్గం ఎంపిక సోమవారం నిర్వహించారు. అందులో భాగంగా మండల శాఖ అధ్యక్షులుగా బల్ల ధర్మారావు, ప్రధాన కార్యదర్శిగా గుడియా వంశి, ఉపాధ్యక్షులుగా అనపోజు హిమకుమార్, అదనపు కార్యదర్శులుగా భార్గవ్, శ్రీకాంత్, ట్రెజరర్‌గా మొర్రి రవి, కార్యదర్శులుగా లింగరాజు బెహరా, కొల్ల ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో ఎపిటిఎఫ్ సీనియర్ కార్యకర్తలు బల్లెడ లక్ష్మణమూర్తి, మొర్రి గోపి, పీస విజయకుమార్, ఎస్.రాజబాబు, శ్రీరామ్మూర్తి, బల్లెడ ఉషారాణి, శ్రీధర్ సమంతో, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్

అండగా నిలవాలి

ప్రజాశక్తి- లావేరు

ఎన్‌డిఎ కూటమి బలపర్చిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే, విజయనగరం ఎంపీ అభ్యర్థులు నదుకుదిటి ఈశ్వరరావు, కలిశెట్టి అప్పలనాయుడులను భారీ మెజారిటీతో గెలిపిస్తామని టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్య దొర అన్నారు. లావేరు సమీపంలో బొడ్డపాడు గెస్ట్‌హౌస్ వద్ద సోమవారం టిడిపి, జనసేన నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను పార్టీ నాయకులు, కార్యకర్తలకు పరిచయం చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేసి భారీ ఓట్లు మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు మాట్లాడుతూ ప్రజాసేవకు ఒకసారి అవకాశం కల్పించాలని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. సమావేశంలో నాయకులు పిన్నింటి మధుబాబు. ఇజ్జడా శ్రీనువాసరావు, కూనపల్లి దామోదరరావు, పిన్నింటి మధుబాబు, సంపతిరావు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'అమర్ కౌముది' విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వివిధ పోటీ పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థులను నగరంలోని బలగలో ఉన్న అమర్ కౌముది స్కూల్ డైరెక్టర్ పొన్నాడ మధు అభినందించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నవోదయ, సైనిక్ పాఠశాలల్లో చేరేందుకు ఇటీవల నిర్వహించిన పోటీ పరీక్షల్లో శ్రీవల్లి, సైనిక స్కూల్ ప్రవేశంలో సీటు దక్కించుకున్న ప్రితిష్ కుమార్‌పండా, ఆలిండియా ట్రిపుల్ ఐటి టాలెంట్ టెస్టులో ప్రథమ స్థానంలో నిలిచిన సాయికుమార్‌లను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు ముద్దాడ ప్రవీణ్, పొన్నాడ రమణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కవిటి కొత్తూరు వద్ద రోడ్డుపై చెట్ల కొమ్మలు

చెట్లు నరికేశారు.. వదిలేశారు

ప్రజాశక్తి- కవిటి

కవిటిలో ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్ 33కెవి లైన్‌కోసం కొన్ని గ్రామాల వద్ద అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించారు. అయితే తొలగించిన కొమ్మలు వెంటనే తరలించకుండా రోడ్డుపైనే వదిలేశారు. ప్రస్తుతం అవి వాహనదారులకు పరీక్ష పెడుతున్నాయి. ముఖ్యంగా కవిటి కొత్తూరు, బొర్రపుట్టుగ, చండిపుట్టుగ గ్రామాల వద్ద తొలగించిన కొమ్మలు రోజులు గడుస్తున్నా తీయకపోవడంతో సాయంత్రం, రాత్రి వేళల్లో ఇటీవల కాలంలో పలు ప్రమాదాలు జరుగుతున్నట్టు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ద్విచక్ర వాహనం కూడా వెళ్లేందుకు అవకాశం లేదని, చెట్ల కొమ్మలు పూర్తిగా రోడ్డుపైనే వదిలేయడంతోనే ఈ సమస్య వస్తోందని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి రోడ్డుపై వేసిన చెట్ల కొమ్మలు వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఓటు హక్కుపై అవగాహన



నందిగాం : ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామైక్య సంఘ సభ్యులు

ప్రజాశక్తి- నందిగాం

ఓటుహక్కు వినియోగంపై ఎంపిడిఒ జి.శివప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని సొంటినూరు, రాంపురం, పెద్ద తామరపల్లిలో అవగాహన సదస్సులు, ర్యాలీలు, మానవహారం చేపట్టి ఓటర్లలో చైతన్యం నింపేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శులు చంద్రశేఖరరావు, సంతోష్ కుమార్, అంగన్వాడీలు, ఆశ, సచివాలయ సిబ్బంది, గ్రామైఖ్య సంఘ సభ్యులు, సిఎఫ్‌లు, సిసిలు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండల పరిధిలో బెలమాం, కొత్తవలస, కొర్లకోట గ్రామాల్లో వైఎస్ఆర్ క్రాంతిపథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించి మహిళలకు అవగాహన కల్పించారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా మహిళలు శతశాతం ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్ మామిడి చంద్రావుతో పాటు అధ్యక్షులు వాకముళ్ల సుశీల, విఒఎ పావని, గ్రామ సంఘం లీడర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండల మహిళా సమైఖ్య, వెలుగు ఆధ్వర్యంలో నివగాం, కర్లెమ్మ గ్రామాల్లో అర్హులైన ప్రతిఒక్కరు ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎపిఎంలు పార్వతి, జనార్దన ప్రజలకు అవగాహన కల్పించారు. పురవీధుల్లో మహిళలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిసి జ్యోతి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

కవిటి: ఓటు వజ్రాయుధమని, ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని ఓటింగ్ శాతం పెంచాలని ఎపిఎం గోవిందరావు అన్నారు. మండలంలోని బల్లిపుట్టుగ, కుసుంపురం గ్రామాల్లో సోమవారం ఓటు హక్కుపై



ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు



కొత్తూరు : మానవహారం నిర్వహిస్తున్న మహిళలు

అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి విస్తృత ప్రచారం



సోంపేట : ప్రచారం చేస్తున్న విజయ

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని తండేవలస, బెండివానిపేట గ్రామాల్లో వైసిపి నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ జిల్లాలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అభివృద్ధిని చూసి ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ మాట్లాడుతూ చంద్రబాబు బతుకంతా వెన్నుపోట్లు, ఇచ్చిన మాట మీద నిలబడకపోవడం, యూటర్న్ తీసుకోవడంతోనే సరిపోయిందని తిలక్ ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.కూర్మారావు, యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, ఎంపిటిసి బెండు సంజీవరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని సంచాం పంచాయతీలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్, ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, వైస్ ఎంపిపిలు, మండల పార్టీ అధ్యక్షులు, జెసిఎస్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని డొంకలపర్తలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి నాగు ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి చేసేవారికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రామారావు, రాష్ట్ర టిట్కో డైరెక్టర్ గోవిందరావు, సర్పంచ్ వి.ప్రభావతి, ఎంపిటిసి గుమ్మిడి రాంబాబు, వైస్ ఎంపిపిలు సూర్యారావు, కరణం కృష్ణం నాయుడు పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని కొర్లాం పంచాయతీ హుకుంపేట, బ్రాహ్మణ కొర్లాం, సుకలూరు గ్రామాల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిని పిరియా విజయ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి దాసు, ఎస్.భాస్కరరావు, బి.శ్రీకృష్ణ, ఆర్.విశ్వనాథం, పద్మమోహన్, టి.గణపతి, బి.పాపారావు, జి.కృష్ణారావు, ఎ.తిరుమల,



బూర్జ : ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న చిరంజీవి నాగు

కె.రమేష్ పాల్గొన్నారు.

కొత్తూరు : కొత్తూరులోని బాపన వీధి, పెద్ద వీధుల్లో ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డి శాంతి తనయుడు ఓంశ్రీకృష్ణ ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, సర్పంచ్ నాసా బాలకృష్ణ, ఎంపిటిసి లక్ష్మీనారాయణ, జి.ఆనందరావు, ఎల్.తిరుపతిరావు, ఎ.నాగేశ్వరరావు, బి.శ్రీను, పి.అశోక్, రాజులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : రెడ్డి శాంతి, పి.తిలక్ గెలుపు కోసం జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, కె.శశిభూషణరావులు మండలంలోని చింతపల్లిలో ప్రచారం నిర్వహించారు.



డిఇఒకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థిని

నైతిక విలువలు అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమాజంలో పిల్లల్లో ఆత్మన్యూనతా భావాన్ని తగ్గించి విద్యతో పాటు నైతిక విలువలు అలవర్చుకునేలా బోధనలను అందించాలని, అప్పుడే విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోగలరని డిఇఒ కె.వెంకటేశ్వరరావు సూచించారు. నగరంలోని బాపూజీ కళా మందిర్‌లో విశాఖ స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలను సోమవారం ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో పాతికేళ్ల విశాఖ స్కూల్ ప్రస్తానంలో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారని అన్నారు. వారిలో దేశ, విదేశాల్లో వివిధ రంగాల్లో రాణిస్తున్న విద్యార్థులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, విశ్రాంత డిఇఒ బలివాడ మల్లేశ్వరరావు, అంబేద్కర్ యూనివర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్ గుంట తులసీరావు, ఐతమ్ కళాశాల డీన్ విష్ణుమూర్తి, విశాఖ స్కూల్ చైర్మన్ కె.మధుసూదనరావు, ప్రధానోపాధ్యాయులు పి.రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గెలుపే లక్ష్యం

ప్రజాశక్తి- పలాస

సార్వత్రిక ఎన్నికల్లో పలాస ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష గెలుపే లక్ష్యంగా పని చేయాలని టిడిపి రాష్ట్ర బిసిసెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు అన్నారు. కాశీబుగ్గలో సోమవారం టిడిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతివార్డులో ఇంటింటికీ తిరిగి చంద్రబాబు అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా గౌతు శిరీష, ఎంపీ అభ్యర్థిగా ఎంపీ రామ్మోహన్ నాయుడును అధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు బి.నాగరాజు, మాజీ కౌన్సిలర్ కొండే నర్సింహులు, యూనిట్ ఇన్‌ఛార్జి గోళ్ళ చంద్రరావు, పిన్నింటి మన్మధరావు, ఇచ్ఛాపురం రమేష్, సింహాద్రి సూర్యం, బడదా ఉమాకాంత్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఐబిపిఎస్' పిఒగా జ్యోత్స్న ఎంపిక

ప్రజాశక్తి- కంచిలి

ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ పరీక్షా ఫలితాల్లో మండలంలోని సాలినపుట్టుగకు చెందిన జోత్స్న ప్రతిభ కనబరిచి పిఒగా ఈ ఎంపికైంది. ఈ మేరకు సోమవారం విడుదలైన ఐబిపిఎస్ పరీక్షా ఫలితాల్లో ఆమె పిఒగా ఎంపికైనట్లు ఆమె తల్లిదండ్రులు సాలిన ఢిల్లీరావు, శేషమ్మ తెలిపారు, తండ్రి ఢిల్లీరావు రైతు కాగా, తల్లి శేషమ్మ అంగన్వాడీ కార్యకర్త. పదో తరగతి వరకు కంచిలిలోని ఓ ప్రయివేటు పాఠశాలలో చదవగా, ఇంటర్మీడియట్ విశాఖపట్నంలో చదివింది. జోత్స్న బ్యాంకు ఉద్యోగానికి ఎంపిక కావడంపై గ్రామస్తులు అభినందించారు.

కళావతమ్మ అంత్యక్రియలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలం నిమ్మడలో రాష్ట్ర టిడిపి అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు తల్లి కళావతమ్మ అంత్యక్రియలు సోమవారం జనసంద్రం మధ్య జరిగాయి. ప్రజలు, పార్టీ నేతలు కార్యకర్తలు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చారు. ఆమె మనుమడు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అంతిమయాత్రలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



తల్లి చితికి తలకొరివి పెడుతున్న అచ్చెన్నాయుడు

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- పలాస

రానున్న వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలో గల పలు వ్యాపార సంస్థల యజమానులు, స్వచ్ఛంద సంస్థలతో చలివేంద్రాల ఏర్పాటుపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున నగరంలో రోజుకు వేలాది మది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని వారిని దృష్టిలో పెట్టుకుని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. పిఒ అప్పలరాజు. సత్యసాయి సేవా సమితి ప్రతినిధి టి.రాజేశ్వరరావు, పి.నారాయణ, లైన్స్ క్లబ్ ఆఫ్ క్యాజులాండ్ మల్ల జయశ్రీ, సంతోషి, టి.శ్వేత, లక్కీ షాపింగ్‌మాల్ మేనేజర్ దారినాయుడు, పెట్రోల్ బంక్ యజమానులు కె.వి.రామకృష్ణ, మల్లా సంతోష్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామ పంచాయతీలో అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎంపిడిఒ ఎచ్చెర్ల పద్మజ అన్నారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో కార్యదర్శులు, అంగన్వాడీ,



కోటబొమ్మాళి : మాట్లాడుతున్న ఎంపిడిఒ పద్మజ

ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. గ్రామాల్లో మంచినీటి ఎద్దడి అధిగమించే విధంగా కృషి చేయాలన్నారు. ఏ గ్రామంలోనైనా మంచినీటి పథకాలు పనిచేయకపోయినా, బోర్లు మరమ్మతులకు గురైతే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఉపాధిహామీ పనులు ఎండను దృష్టిలో ఉంచుకొని ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం మూడున్నర గంటల నుంచి 6 గంటల వరకు పనులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి, నిమ్మడ పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ గురుగుబెల్లి సురేష్ కుమార్, డాక్టర్ వరుణ్, ఎంఇఒలు ఎస్.అప్పలరాజు, ఎల్‌వి.ప్రతాప్, ఎపిఒ జి.హరిప్రసాద్ పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటా ప్రచారం



పలాస : సభలో మాట్లాడుతున్న గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి అధినేత చంద్రబాబును సిఎం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మండలంలోని శాసనాం, టెక్కలిపట్నంలో ప్రచారం చేపట్టారు. శాసనాంలో జరిగిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. ముందుగా శాసనాం గ్రామంలో పలువురు టిడిపిలో చేరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలు జగన్ బూటకపు హామీలను నమ్మే స్థితిలో లేరన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు ప్రవేశపెట్టి అందించనురన్నారు. అనంతరం లక్ష్మీపురంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, మాజీ ఎంపిపి దువ్వాడ కృష్ణమూర్తి నాయుడు, మాజీ ఎమ్మెల్యే దువ్వాడ నాగావళి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, కుత్తుం లక్ష్మణ్‌కుమార్, దువ్వాడ సంతోష్, దశరథ, చంద్రశేఖర్ అధికారి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని ముక్తాపురం, చొంపాపురం గ్రామాల్లో టిడిపి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు శంఖారావం నిర్వహించారు. ఈ మేరకు సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సలాన మోహనరావు, ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు ఎల్లంనాయుడు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని సహలాలపుట్టుగ పంచాయతీలో ఎమ్మెల్యే అశోక్ భార్య నీలోత్పల బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు.



మెళియాపుట్టి: ప్రచారం చేస్తున్న గోవిందరావు



సోంపేట : చలివేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

చలివేంద్రాలు ప్రారంభం

కవిటి: వేసవి తీవ్రత దృష్ట్యా మండలంలోని ప్రతి పంచాయతీలోనూ సోమవారం చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కవిటి బస్టాండ్‌లోని ప్రయాణికుల విశ్రాంత భవనంలో తహశీల్దార్ లక్ష్మి, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రయాణికులకు చల్లని తాగునీరు అందించారు. అనంతరం మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని ప్రతి సచివాలయం పరిధిలోనూ చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. బాటసారులు, ప్రయాణికులు వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. ఎంపిసి సత్యనారాయణ, ఇఒ వీరబద్రస్వామి, విఆర్‌ఒలు నారాయణ, ప్రశాంతి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ మామిడి సురేష్ చలివేంద్రం ప్రారంభించారు. ఎండలు కారణంగా కార్యాలయానికి పనులపై వచ్చిన సందర్శకుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు తెలిపారు. కార్యక్రమంలో డిటి వాయలపల్లి గిరిరాజ్, ఆర్‌ఐ పవిత్ర, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

సోంపేట : ఎంపిడిఒ కె.రామారావు ఆదేశాల మేరకు కొర్లం పంచాయతీ అధికారులు స్థానిక కూడలి వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు.

గ్రామాల్లో 'సువ్వారి' ప్రచారం

ఆమదాలవలస: నియోజకవర్గ పరిధిలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఇరు పార్టీల కుటుంబ రాజకీయ నాయకులు విఫలమయ్యారని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ ఆగ్రహం వ్యక్తం చేసారు. సోమవారం మండలంలోని అక్కులపేట, శ్రీనివాసాచార్యులపేట, మండాది, ఈసర్లపేటలో పొందూరు మాజీ ఎంపిపి సుబ్బారెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సువ్వారి సువర్ణలతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో తనకు ఓటువేసి ఒక్క అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో సువ్వారి అనిల్ కుమార్, వైకుంఠరావు, బొడ్డేపల్లి గోవిందరావు, సత్తారు నరసింగరావు పాల్గొన్నారు.

బురిడివలస వాసుల మద్దతు..

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి మండలం బురిడివలసకు చెందిన 20 కుటుంబాలు సోమవారం సువ్వారి గాంధీకి మద్దతు పలికాయి. కార్యక్రమంలో నాయకులు బెండి పాపారావు, యండ అప్పలనాయుడు, ఇల్లాకుల శ్రీను, భాను ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గడ్డివాముల దగ్ధం

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని బెజ్జిపల్లికి చెందిన పొందర తారకేశ్వరరావు, పొందర కోటేశ్వరరావుకు చెందిన రూ.20 వేలు విలువ చేసే గడ్డికుప్పలు సోమవారం మధ్యాహ్నం దగ్ధమయ్యాయి. అయితే గ్రామస్తులు టెక్కలి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో టెక్కలి అగ్నిమాపకాధికారి ఎస్.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పలాస

పలాస టిడిపి కార్యాలయంలో సోమవారం మందస మండలం నల్లబొడ్డూరుకు చెందిన వైసిపి నాయకులు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి శిరీష టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బొడ్డు లోకేశ్వరి, బొడ్డు హేమలత, పందిరి కల్పన, పందిరి పాపారావు ఉన్నారు. కార్యక్రమంలో మందస మండల నాయకులు మామిడి తాతారావు, సాలినా మాధవరావు, సాలినా జానకిరావు, కోట నీలకంఠం, పందిరి శ్రీను, కరగాన వల్లభరావు, తిమ్మల సందేశ్‌కుమార్, సారా రవి, అందాల గిరి, కోట జయరామ్ పాల్గొన్నారు.

సంక్షేమానికి కృషి

ఇచ్ఛాపురం : తెలుకుల సంక్షేమానికి కృషి చేస్తానని కృష్ణ సాహు హామీనిచ్చారు. పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో తెలుకుల పెద్ద ఎన్నికలో కృష్ణసాహును సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా సన్న సాహు, సత్య నారాయణ సాహు, కమిటీ సభ్యులుగా తిర్నాత్‌సాహు, గణపతి సాహును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాస సాహు, బృందావన్ సాహు, దుదిష్టి సాహు, ప్రవీణ్, టి.కాళీ, కిషోర్, రామచంద్ర పాల్గొన్నారు.

హరిశ్చంద్రపురంలో అన్నదానం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలం పెద్ద హరిశ్చంద్రపురంలో గ్రామస్తుల సహకారంతో నిర్మించిన రాజరాజేశ్వరీ సహిత వెంకటేశ్వరస్వామి పంచాయతన ఆలయ విగ్రహ శిఖర పున: ప్రతిష్టా కార్యక్రమం సోమవారం వేద పురోహితులు పెంట వెంకట సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం 6 వేల మందితో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యకమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

'వైసిపి ఎన్నికల కోడ్ ఉల్లంఘన'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో వైసిపి యథేచ్ఛగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తోందని, ఖజానాలో ఉన్న సొమ్మును అనుకూల కాంట్రాక్టర్లకు రూ.13 వేల కోట్లు బిల్లులు చెల్లించి పేదల పింఛను సొమ్ము లేకుండా చేశారని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు ఆరోపించారు. టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు బొణిగి భాస్కరరావు, బిసి సాధికారిక రాష్ట్ర కమిటీ సభ్యులు రామరాజుతో కలిసి సోమవారం విలేకరులతో మాట్లాడారు. లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయడానికి అవసరమైన వ్యవస్థ ఉందని అన్నారు. 1న పింఛను చెల్లించాల్సిన ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిలుపుదల చేసిందని, టిడిపి వల్లే పింఛను చెల్లించలేకపోతున్నామని విషప్రచారం చేయడం తగదన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా యుద్ధప్రాతిపదికన ఫించన్లు ఇంటి వద్దే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే నెలకు రూ.4 వేలు పింఛను చెల్లిస్తామని మేనిఫెస్టోలో పెట్టామని అన్నారు.



మాట్లాడుతున్న గొండు శంకర్

టిడిపిపై విష ప్రచారం తగదు

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలో ప్రజలు వైసిపి ఐదేళ్ల పాలనతో విసుగు చెందారని శ్రీకాకుళం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో గల నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల వేళ లబ్ధిదారులకు పింఛన్లు, ఉద్యోగులకు జీతాలు, బటన్ నొక్కిన పథకాలకు నిధులు ఇవ్వకుండా తమ స్వార్ధ ప్రయోజనం కోసం అనుకూల కాంట్రాక్టర్ల ఖాతాలకు రూ.13 వేల కోట్లు నిధులు మళ్లించారని విమర్శించారు. వాలంటీర్లను అడ్డంపెట్టుకుని వైసిపి రాజకీయం చేస్తోందని విమర్శించారు. వాలంటీరు వ్యవస్థపై న్యాయస్థానం అభ్యంతరం చెపితే టిడిపిపై విషపు ప్రచారం చేస్తున్నారన్నారు. అలాగే గతంలో తండ్రి అధికారాన్ని అడ్డంపెట్టుకుని నగరంలోని రౌడీయిజం చేసేది ఎవరో ప్రజలకు తెలుసని, మంత్రి ధర్మాన చేస్తున్న విమర్శలు అర్ధరహితమని అన్నారు. సమావేశంలో కోరాడ సర్వేశ్వరరావు, చల్లా వెంకటేశ్వరరావు, పాండ్రం కి శంకర్, మూకళ్ల శ్రీను, రెడ్డి శంకర్ పాల్గొన్నారు.

15 మద్యం సీసాలు పట్టివేత

ఆమదాలవలస : ఎన్నికల విధుల్లో భాగంగా మండలంలోని కొత్తవలస జంక్షన్ వద్ద 15 మద్యం సీసాలను పట్టుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ డిటి కె.నీలిమ తెలిపారు. కొత్తవలస జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా మండలంలోని కట్యాచార్యులపేటకు చెందిన మన్నేన తారకేశ్వరరావు గ్లామర్ బైక్‌పై 15 మద్యం సీసాలు తీసుకు వెళ్తుండగా పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని తారకేశ్వరరావుపై కేసు నమోదు చేసి ఎస్ఐ కె.వెంకటేష్ దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజన అభివృద్ధికి జగ్గారావు బాటలు

శ్రీకాకుళం అర్బన్ : మూడున్నర దశాబ్దాల పాటు గిరిజన సంక్షేమశాఖలో వసతిగృహ సంక్షేమ అధికారిగా పనిచేసి విద్యార్థులకు గుడ్ల జగ్గారావు ఎన్నో సేవలందించారని స్టార్ వాకర్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు, వాకర్స్ మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు బి.వి.రవిశంకర్‌లు అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ ఆధ్వర్యాన జగ్గారావు జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోమారు మూల గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి బాటలు వేశారన్నారు.